క్లుప్తంగా

విధుల్లో చేరిన పశుసంవర్ధక సహాయకులు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా పశు సంవర్ధక సహాయకులుగా కొత్తగా నియమితులైన వారికి మంగళవారం వరకు పూర్తిస్థాయిలో నియామక ఉత్తర్వులు అందజేశారు. వీఏఏల పోస్టుల భర్తీలో భాగంగా ఇటీవల జిల్లా పరిధిలో 130 మంది అర్హత సాధించారు. వీరిలో 124 మందికి పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. వీరిలో 70 శాతానికి పైగా విధుల్లో చేరారు. ప్రతి ఉద్యోగి అంకిత భావంతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని డీఏహెచ్ఓ పిలుపు నిచ్చారు.

వెదురు వేలంలో ఆదాయం



వేలం నిర్వహిస్తున్న సబ్ డీఎఫ్ఓ

రుద్రవరం: వెదురు,కలప వేలం పాటల్లో ప్రభుత్వానికి దాదాపు రూ.4లక్షల ఆదాయం సమకూరినట్లు సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక కలప డిపోలో మంగళవారం మొదటి,రెండు,మూడవ తరగతులకు చెందిన 9వేల వెదుర్లకు వేలం నిర్వహించారు. కాంట్రాక్టర్లు పోటీపడి వేలం పాడటంతో ఆదాయం పెరిగిందని చెప్పారు. రుద్రవరం రేంజి అధికారి శ్రీపతి నాయుడు, ఎఫ్ఎస్ఓ నాగరాజు,సిబ్బంది,కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ల నిర్వహణకు వేలం

శిరివెళ్ల: ఈ నెల 6వ తేదీన స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ మార్కెట్ల నిర్వహణకు బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు శిరివెళ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర మంగళవారం తెలిపారు. వేలం పాటలలో పాల్గొనే వారు దిన మార్కెట్‌కు రూ.40 వేలు, వారం సంత మార్కెట్‌కు రూ.50 వేలు, కబేలాకు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు. పంచాయతీకి బకాయిలున్న వారు పాటలకు అనర్హులని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వసతుల వివరాల పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గోస్పాడు: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎలక్టోరల్ అధికారి, ఎంపీడీఓ నాగఅనసూయ మంగళవారం పరిశీలించారు. పసురపాడు, ఎస్.కూలూరు, రాయపాడు, తేళ్లపురి, జూలేపల్లె గ్రామాల్లోనున్న పోలింగ్ కేంద్రాలను స్థానిక సిబ్బందితో కలసి తనిఖీ చేసి సదుపాయాలపై ఆరా తీశారు. వివరాలను వీఆర్వోలను అడిగి తెలుసుకున్నారు.

నేడు 'పీఎం విశ్వకర్మ'పై అవగాహన

నంద్యాల(అర్బన్): ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై బుధవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో భారత ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలోని ఎంఎస్ఎంఈ–డెవలప్‌మెంట్ ఫెసిలిటేషన్ ఆఫీసు, జిల్లా పరిశ్రమల శాఖ, డీఆర్‌డీఏ, డీపీఓ నంద్యాల జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. సంబంధిత కులవృత్తి దారులు పాల్గొని ఈ పథకం ద్వారా వచ్చే లబ్ధిని పొందాలని, వివరాలకు డీవీఎస్ఆర్ మూర్తి అసిస్టెంట్ డైరెక్టర్ సెల్ 9492689462 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు కోరారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: పశు పోషకులు పశువుల వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. కానాలపల్లె గ్రామంలో మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఇన్‌చార్జి డాక్టర్ సంతోష్‌కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గేదెలకు గర్భకోశ పరీక్షలు, దూడలకు నట్టల నివారణ, జీర్ణకోశ, శ్వాశ్వకోశ సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం జాగ్రత్తలపై అవగాహన కల్పించి మందులను ఉచితంగా అందజేశారు.

రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులకు సర్వహక్కులు కల్పించేందుకే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందని 26వ వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్లు పూర్తయిన 69 మందికి డాక్యుమెంట్లను మంగళవారం వార్డు సచివాలయ ఆవరణలో పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో యువ భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సాంకేతిక పురోగతి సాధించి అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. కళాశాలలో అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను స్థాపించినట్లు తెలిపారు. అధ్యాపకులు ఇంతియాజ్ అహమ్మద్, యశ్వంత్‌రెడ్డి, ప్రగతిరెడ్డి పాల్గొన్నారు.

అతివల అభివృద్ధికి చేయూత



ఈమె పేరు లీలావతమ్మ. మిడుతూరు గ్రామ వాసి. తొలి విడత వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18,750 మంజూరైంది. ఆ సొమ్ముతో కిరాణా షాపు ఏర్పాటు చేసుకుంది. ఏటా వచ్చే మొత్తంతో వ్యాపారం స్థాయి పెంచుకుంది. ప్రస్తుతం వ్యాపారం బాగా సాగుతుండటంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు తప్పాయని చెబుతోంది.



ఈమె బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు గ్రామానికి చెందిన నాగమణి. చీరల వ్యాపారం చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తుంది. మూడు విడతల్లో వచ్చిన మొత్తంతో వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంది. అలాగే కుటుంబం వ్యవసాయ పనులపై ఆధారపడి జీవనం సాగిస్తుండటం, తన వ్యాపారంలో వచ్చిన లాభాలు తోడవడంతో జీవనానికి ఇబ్బందులు తప్పాయని, సంతోషంగా ఉంటున్నామని పేర్కొంది.

- వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మహిళల జీవితాల్లో వెలుగులు
- మూడు విడతల్లో 2,75,504 మందికి రూ.516.57 కోట్ల ప్రయోజనం
- ఈనెల 7న నాలుగో విడత నిధులు విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్
- 97,254 మంది మహిళలకు రూ.182.35 కోట్ల లబ్ధి



ఇక్కడ కిరాణా దుకాణం నిర్వహిస్తున్న మహిళ పేరు మంజుల. మిడుతూరు గ్రామంలో మొదట టైలరింగ్ పనులు చేసేది. అయినా సరైన ఆదాయం లేకపోయింది. కుటుంబం గడవడం కష్టంగా ఉన్న సమయంలో జగనన్న అందజేసిన చేయూత సొమ్ముకు కొంత జమ చేసుకొని కిరాణ దుకాణం ప్రారంభించింది. మరో రెండు విడతల సొమ్మును వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టి సరుకు పెంచింది. ప్రస్తుతం గిరాకీ బాగుందని ఈ ఆదాయంతోనే పిల్లలను పోషించుకుంటున్నామని, గతంలోలా కష్టాలు తప్పాయని సంతోషం వ్యక్తం చేసింది.

నంద్యాల(న్యూటౌన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత పథకం మహిళల ఎదుగుదలకు అండగా నిలుస్తోంది. 45 – 60 ఏళ్ల నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలను ఈ పథకం ద్వారా ఆదుకుంటోంది. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో లబ్ధి పొందిన మహిళల కుటుంబాల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయి. నాలుగేళ్ల పాటు ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.75 వేలు అందిస్తోంది. ఇప్పటికే మూడు విడతల్లో జిల్లాలోని 2,75,504 మందికి రూ.516.57 కోట్లు చెల్లించగా, చివరి విడత రూ.18,750 నగదును అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెలలో 7వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులను విడుదల చేయనున్నారు. జిల్లాలోని పేద మహిళలు ఆర్థిక ఎదుగుల కోసం పెట్టుబడులు పెట్టి శ్రమిస్తున్నారు. వీరికి చేయూతనిస్తే మరింత అభివృద్ధిలోకి వస్తారని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ చేయూత పథకం అమల్లోకి తెచ్చారు. ఈ పథకం ద్వారా ఒక్కో మహిళకు ఏడాదికి రూ.18,750 చెల్లిస్తారు. ఇలా ఇప్పటికే మూడు విడతలు పూర్తవగా ఈనెల 7న నాలుగో విడత జమకానుంది. ఆర్థిక లబ్ధి పొందిన మహిళలు ఇప్పటికే నిర్వహించుకుంటున్న వ్యాపారాలను విస్తరించారు. స్త్రీ నిధి, ఉన్నతి నిధులను కూడా పొంది సద్వినియోగం చేసుకునే వెసులుబాటును కల్పించారు. ఉన్నతి రుణాలు పొందే ఎస్సీ, ఎస్టీలకు వడ్డీ ఉండదు.

విడతలు	లబ్ధిదారులు	చెల్లించిన సొమ్ము (రూ. కోట్లలో)
మొదటివిడత	87164	163.43
రెండో విడత	93,351	175.13
మూడో విడత	94,989	178.01
నాల్గో విడత	97,254	182.35
మొత్తం	3,72,758	698.92

సంస్థల సహకారం...

మహిళలకు వైఎస్సార్ చేయూత ద్వారా పెట్టుబడిగా వినియోగించుకునేలా తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని నిధులు అందిస్తూనే మరోవైపు మహిళల వ్యాపార రంగంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండటం కోసం రిలయన్స్, హెచ్ఎయూఎల్, పీఅండ్‌జీ, ఐటీసీ, అమూల్, అజియో టెక్స్‌టైల్స్, మహేంద్ర కేతి, గ్రామీణ వికాస కేంద్రం, హైఫర్, సీఎస్సీ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకుని లబ్ధిదారులను అనుసంధానం చేసి నేరుగా వారికే సరుకులు తక్కువ ధరకు అందజేసేలా చర్యలు చేపట్టింది. దీంతో వారికి లాభాల శాతం పెరిగి త్వరగా ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం లభించేలా చేసింది. ఇంత వరకు వ్యాపారాలు ప్రారంభించని మహిళలకు కూడా వీటిపై ఆసక్తి కలిగేలా పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులు కృషి చేస్తున్నారు.

ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించండి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సజావుగా, సమర్థవంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు దఫా దఫాలుగా ఇస్తున్న శిక్షణ కార్యక్రమాల్లో సంపూర్ణ అవగాహన పొంది ఎలాంటి విమర్శలకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ఎన్నికల సమర్థవంత నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గాల మాస్టర్ ట్రైనర్లు, సెక్టోరియల్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని పలు ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.పద్మజ, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులకు సంబంధించి ఎలాంటి మినహాయింపులు ఉండవని, అధికారులకు అప్పగించిన పనుల్లో ఏమాత్రం అలక్ష్యం చేసినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు లోను కాకుండా ప్రశాంత ఎన్నికల ఓటింగ్ ప్రక్రియపై దృష్టి సారించాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్స్, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌ల పనితీరు, మాక్ పోలింగ్, ఓటర్ల జాబితా తదితర పనుల నిర్వహణకు పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా తెలుసుకోవాలని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల మ్యాపింగ్ చేసి ప్రతిపాదనలు ఉంటే వెంటనే సమర్పించాలని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. నంద్యాలలో 5, డోన్ లో 2, శ్రీశైలం ఒకటి, బనగానపల్లెలో ఒక పోలింగ్ స్టేషన్ల హేతు బద్ధీకరణకు ప్రతిపాదనలు ఇస్తే ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలను స్వయంగా తనిఖీ చేసి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని తహసీల్దార్లకు సూచించారు.

నీటి సమస్య పరిష్కారం



పుచ్చకాయలపల్లె వద్ద ఏర్పాటు చేసిన బోరును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ఉయ్యాలవాడ : మండలంలోని బోడెమ్మనూరు గ్రామంలో తాగునీటి పథకం నిర్వహణకు మండల పరిషత్ నిధుల నుంచి రూ. 3.50 లక్షలు కేటాయించడంతో నీటి సమస్యకు పరిష్కారం లభించింది. వేసవి కాలం కావడంతో కుందూనదిలో నీటి ప్రవాహం తగ్గింది. గ్రామంలో మంచినీటి సమస్య నెలకొనడంతో ముందస్తుగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పుచ్చకాయలపల్లె వద్ద ప్రత్యేక బోరు ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా బోడెమ్మనూరు గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకును నీటితో నింపి గ్రామంలో కుళాయిలకు సరఫరా చేస్తున్నట్లు ఏఈ ఫణీత్‌కృష్ణ మంగళవారం తెలిపారు. ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయడంపై సర్పంచ్ బందెల సువర్ణ కృతజ్ఞతలు తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న సీపీడీఓ చంద్రకళ

నంద్యాల(అర్బన్): చదువు ద్వారానే బాలికలకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ తెలిపారు. పట్టణ శివారులోని కేజీబీవీలో మంగళవారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు చదువుకున్నప్పుడే సమాజంలో మార్పులు తీసుకురాగలమన్నారు. ఏదైనా సంఘటన జరిగితే 1098, 181, 112, 100 టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సూపర్‌వైజర్లు నజీరా, విజయలక్ష్మి, అనురాధ, సుజాత పాల్గొన్నారు.

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



ఆలమూరు చెన్నకేశవ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: ఆలమూరు లక్ష్మీదేవి,చెన్నకేశవ,లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో ధ్వజ, విగ్రహ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలు మంగళవారం ప్రారంభించారు. ఆలయ ఈఓ సాయి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ శూలం ప్రభాకర్, సర్పంచు పాణ్యం లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ పాణ్యం నాగేష్ పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాలు మూడు రోజుల పాటు సాగుతాయని, చివరి రోజు ధ్వజ,విగ్రహ ప్రతిష్ఠ గావిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్విగ్వరణం, కలశ స్థాపనం, యంత్రాభిషేకం, జలాధివాసం, అంకురారోపణ తదితర పూజలు జరపించారు. నాయకులు విజయకుమార్,చంద్ర పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై అపోహలు వద్దు



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నంద్యాల(సిటీ): వేసవిలో పట్టణానికి తీవ్ర నీటి ఎద్దడి తలెత్తనుందనే అసత్య ప్రచారాన్ని, అపోహలను పట్టించుకోవద్దని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా తెలిపారు. మంగళవారం బండిఆత్మకూరు మండలం, సంతజూటూరు పికప్ ఆనకట్టను మున్సిపల్, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నంద్యాల ప్రజల తాగునీటి అవసరాల కోసం వెలుగోడు రిజర్వాయర్ నుంచి 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారన్నారు. ఈ నీటిని నంద్యాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నింపి ప్రజలకు పంపిణీ చేస్తామన్నారు. కాగా విడుదల చేసిన నీటిని రైతులు తరలించకుండా ఉన్నతాధికారులు తగిన ఏర్పాటు చేశారని చెప్పారు. వైస్ చైర్మన్ పాంషావలి, మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, కౌన్సిలర్లు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఉపాధి హామీ పథకం సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏపీడీ సాంబశివరావు కోరారు. ఏపీఓలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి నంద్యాల పీడీ కార్యాలయ సూపరింటెండెంట్ వహీద్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో వివిధ హోదాల్లో పని చేస్తున్న సిబ్బందికి పీఆర్సీ 23 శాతం అమలు, జీతాలు పెంపుదల చేయాలని కోరారు. పెరిగిన జీతాన్ని బేసిక్‌పై నందు కలపకుండా విడిగా ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. 17సంవత్సరాలుగా నిరంతరాయ సేవలు అందిస్తున్నా తమకు పూర్తిస్థాయి న్యాయం జరగడం లేదని, ఇప్పటికైనా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీఓలు శ్రీకళా రెడ్డి, నాగజ్యోతి పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బొగ్గులైన్ వాసుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పుల్లానరసింహులు కోరారు. మంగళవారం బొగ్గులైన్ కాలనీ వాసులతో సమావేశమయ్యారు. టిడ్కో ఇళ్లలో సౌకర్యాలు కల్పించాలన్నారు. 600కుటుంబాలు ఉన్నాయని, వారికి ఒకేచోట ఇళ్ల స్థలాలు ఇచ్చి సౌకర్యాలు కల్పించిన తర్వాతనే ఖాళీ చేయించాలన్నారు. సాయి, హరి, కరుణాకర్, ప్రసాద్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి..

గోస్పాడు: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవోనెం .117ను రద్దు చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. 20లోపు విద్యార్థుల సంఖ్య ఉన్న ఏకో ఉపాధ్యాయ పాఠశాలలకు అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. పండిత పదోన్నతులు చేపట్టాలని, అర్హులైన పాఠశాల సహాయకులకు జేఎల్‌గా పదోన్నతి కల్పించాలని అన్నారు. నాయకులు సురేష్‌శర్మ, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): ఈనెల 9వ తేదీన అమరావతిలో జరిగే వికలాంగుల మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ముప్పంగి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచాలని, పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు వికలాంగులకు 5శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బెనర్జీమాదిగ, సామేలు మాదిగ, ఓబులేసు మాదిగ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

గోస్పాడు: ఆరోగ్యశ్రీ కార్డు పరిమితిని ప్రభుత్వం రూ.25 లక్షలకు పెంచిందని డీఎల్‌డీఓ మురళీకల్యాణి అన్నారు. మండలంలోని జూలేపల్లె, యాళ్లూరు సచివాలయాలను మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డుల్లో ఏవైనా తప్పు ఒప్పులు ఉంటే వాటిని గుర్తించాలన్నారు. గోస్పాడు మండలానికి 12,571 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరయ్యాయని చెప్పారు. అనంతరం సచివాలయాల్లో రికార్డులను పరిశీలించి సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ నాగఅనసూయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దొర్నిపాడు: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని ప్రభుత్వం రూ.25 లక్షల వరకు పెంచిందని ఎంపీడీఓ సుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. కొండాపురం, అర్జునాపురం, అమ్మిరెడ్డినగరం, రామచంద్రాపురం, బుర్రారెడ్డిపల్లె, డబ్ల్యూ కొత్తపల్లె, దొర్నిపాడు గ్రామాల్లోని లబ్ధిదారులకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నూతన ఆరోగ్యశ్రీ కార్డులను అందజేసినట్లు చెప్పారు. వలంటీర్లు వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఉశేని, మహేష్, మధు, నాగార్జున, లక్ష్మయ్య పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలానికి సుమారు 11,728 నూతన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరైనట్లు ఎంపీడీఓ సుర్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చాగలమర్రి–1,2,3 సచివాలయల పరిధిలో, శెట్టివీడు, గొడిగనూరు, ముత్యాలపాడు, డి.వనిపెంట, డి.కొత్తపల్లె, మల్లెవేముల, మద్దూరు గ్రామాల్లో కార్డుల పంపిణీని పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ 5 రోజులుగా మండలంలో 7,114 కార్డులను పంపిణీ చేశామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు స్వర్ణకుమార్, దస్తగిరి, సిబ్బంది రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి



రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి

ఆళ్లగడ్డ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆళ్లగడ్డ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు పాటించాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఏఆర్‌ఓ, తహసీల్దార్ నజీర్ అహమ్మద్, ఎన్నికల డీటీ చంద్రశేఖర్ ఉన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

చాగలమర్రి: ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో సుమారు వంద సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ గుర్తించిందని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించామని ఆర్‌ఓ మల్లికార్జునరెడ్డి తెలిపారు.మంగళవారం మండలంలోని ముత్యాలపాడు, గొడిగనూరు, శెట్టివీడు, చిన్నవంగలి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్లకు కావలసిన మౌలిక సదుపాయలను పరిశీలించారు. అనంతరం ఆయన శెట్టివీడులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన 204, 205 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అందులో ఉన్న వాటర్ ప్లాంటును తాత్కాలికంగా తొలగించాలని డీటీ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వాటిలో వంద సమస్యాత్మకమైనవిగా గుర్తించామని చెప్పారు. అంటే ఒక పోలింగ్ కేంద్రంలో ఒకే పార్టీకి 90 శాతం ఓట్లు పోలైనా, తక్కువ శాతం ఓట్లు పోలైనా ఆ పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల కమిషన్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రంగా గుర్తిస్తుందన్నారు. తహసీల్దార్ రవణమ్మ, డీటీ యాసీన్, వీఆర్‌ఓ వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఉయ్యాలవాడ : ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్థానిక మోడల్ స్కూల్‌ను పరీక్షా కేంద్రంగా ప్రకటించారన్నారు. ఇందులో హరివరం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 40 మంది విద్యార్థులు, మాయలూరు 53, బోడెమ్మనూరు 35, స్థానిక ఉన్నత పాఠశాల నుండి 34, ఏపీ మోడల్ స్కూల్ నుంచి 66, కోవెలకుంట్ల మండలం గుళ్లదుర్తి పాఠశాల నుంచి 59 మందితో కలిపి మొత్తం 287 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. చీఫ్‌గా శకుంతల, డిపార్ట్‌మెంటల్ అధికారిగా నాగరాజు, 18 మందిని ఇన్విజిలేటర్లుగా నియమించారని చెప్పారు.

పనికితగ్గ వేతనమివ్వాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, ఆయాలకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని సంఘం నాయకులు కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివబాలకృష్ణ మాట్లాడుతూ రూ.26వేలు వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ, బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేశారు. కుళ్లాయిస్వామి, సులోచన, రాధా, మారెమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ నాయక్ వసీం

శిరివెళ్ల: ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఎంపీపీ నాయక్ వసీం తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేసిందని వాటితో గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటుమన్నామన్నారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవనందున నీటి మట్టం తగ్గుతుందని చేతి పంపుల్లో మట్టం తగ్గినట్లయితే అదనపు పైపులు వేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కేసీ, తెలుగు గంగ కాల్వలకు తాగునీటి కోసం నీటిని విడుదల చేయగా వాటితో శిరివెళ్ల, గంగవరం, చెన్నూరు, బోయలకుంట్ల చెరువులు నింపామని చెప్పారు. మండల పరిషత్ నిధులతో పైప్‌లను కొనుగోలు చేస్తున్నామని అవసరమైన గ్రామాలకు సరఫరా చేస్తామన్నారు. చెడిపోయిన చేతి పంపులు వెంటనే మరమ్మతులు చేయించుకోవాలని సర్పంచులకు సూచించారు. అనంతరం శాఖల వారిగా అధికారులు తమ పనితీరును సభకు వివరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్, ఎంపీడీఓ ఫణి రాజకుమారి, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం లాభసాటి



శిక్షణ ఇస్తున్న అడిషనల్ డీపీఎం అబ్దుల్ సలాం

శిరివెళ్ల: ప్రకృతి సేద్యం లాభసాటిగా ఉంటుందని ఎస్ఎఫ్ఏ అడిషనల్ డీపీఎం అబ్దుల్ సలాం తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం మండల మండల కార్యాలయంలో ఆళ్లగడ్డ క్లస్టర్ ఖుషీ షఫీలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రైతులు అధిక పెట్టుబడి, రసాయన ఎరువులు వాడి నష్ట పోతున్నారన్నారు. అలాగే భూసారం కూడా తగ్గిపోతుందని, పండిన పంట విషపూరితంగా తయారవుతుందన్నారు. అదే ప్రకృతి సేద్యంతో తక్కువ పెటుబడి, అధిక లాభాలు గడించవచ్చన్నారు. ఈ విధ్యానంలో పండిన ధాన్యానికి మంచి గిరాకి ఉందన్నారు. జిల్లాలో 9 వేల మంది రైతులు 10,500 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నారన్నారు.